


అక్రమ బదిలీలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కౌన్సిలింగ్‌కి తూట్లు పొడిచే అక్రమ బదిలీలను రద్దు చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టులు బ్లాక్ చేసి, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇటీవల బదిలీలు చేపట్టిన అధికారులు, ప్రభుత్వం ఎటువంటి నిబంధనలూ పాటించకుండా ఇష్టారాజ్యంగా బదిలీలు చేయడం దుర్మార్గమన్నారు. జిఓ 117ను, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ బదిలీలను రద్దు చేయాలని సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మనిషికో మాట... పశువుకో దెబ్బ అంటారు పెద్దలు. అచ్చంగా అదే సామెతను గుర్తుచేస్తున్నారు విజయనగరం కార్పొరేషన్ ఒకటో డివిజన్ అయ్యప్పనగర్ వాసులు. వార్డు, పట్టణ, జిల్లా అధికారులు, జిల్లా సర్వోన్నత అధికారి కలెక్టర్‌కు విన్నవించినా తమ కాలనీలోని అక్రమ వాటర్ ప్లాంటును తొలగించడం లేదని, చివరికి వారు సీజ్ చేసిన బోరును గంట వ్యవధిలో తెరిచి యథేచ్ఛగా నిర్వహిస్తున్నా అధికారులు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వ గెడ్డ స్థలాన్ని ఆక్రమించి, ఎలాంటి అనుమతులూ లేకుండా బోరు తవ్వినట్టు ఓవైపు నోటి మాటలతో అంగీకరిస్తూనే.... మరోవైపు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి సమస్య పరిష్కారానికి మీనమేషాలు లెక్కిస్తున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయ్యప్పనగర్ వాసుల కథనం ప్రకారం..

అక్రమ బోరు తొలగింపునకు ఏడాది సరిపోదా?



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న పిపిఎస్‌ఎస్, అయ్యప్పనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

- ప్రభుత్వ స్థలంలో అక్రమ తవ్వకమని అంగీకరిస్తూనే పట్టించుకోని వైనం
- కలెక్టర్‌కు 9, జెసికి 2 వినతులు.. ● ఆర్‌డిఒకు, జలవనరుల శాఖకు రెండేసి సార్లు..
- మున్సిపల్ కమిషనర్‌కు లెక్కకు 15 ఫిర్యాదులు.. ● టూ టౌన్ పోలీసులకు ఒకసారి..
- రగిలిపోతున్న అయ్యప్పనగర్ వాసులు ● నాయకులకు దాసోహమైపోయారంటూ ఆగ్రహం



జెసికి సమస్యను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, నాయకులు శంకరరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నగరంలోని ఒకటో డివిజన్ అయ్యప్పనగర్ ప్రశాంతతకు మారుపేరు. ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. దీంతో, ఈ ప్రాంతంలో నివాసాల ఏర్పాటుకు జనం ఎంతో ఇష్టపడుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, అధికారులు, కొంతమంది రాజకీయ నాయకులు కూడా ఈ ప్రాంతంలో ఎక్కువగానే ఉన్నారు. గత మూడేళ్లలో క్రమంగా నివాసాలు పెరిగాయి. ఈ క్రమంలో ప్రతి ఇంటికీ ఓ బోరు అవసరం కావడంతో గత ఏడాది భూగర్భజలాలు అడుగంటాయి. కాలనీవాసులు బోరు మోటార్లు మార్చుకున్నా, లోతును పెంచినా ఫలితం లేకపోయింది. దీంతో, కాలనీలో చాలా మంది జియాలజిస్టులను రప్పించి పరిశోధనలు చేపట్టారు. చివరికి స్థానికంగా ఉన్న స్వాతీ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ బోరు సుమారు 500 అడుగుల లోతులో ఉందని తేలింది. అందువల్లే కాలనీలో బోర్లు ఎండిపోయాయని, దాన్ని తొలగిస్తే తప్ప స్థానికంగా భూగర్భజలాలు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని కూడా తేల్చిచెప్పారు. తీరా కాలనీవాసులు ఆరా తీస్తే ఆ ప్లాంట్ పూర్తిగా ప్రభుత్వగెడ్డ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిందని కూడా తేలింది. దీంతో అక్రమ ప్లాంట్‌ను తొలగించాలంటూ ఇదే కాలనీలో నివాసం ఉంటున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం, ఇటీవల కాలం వరకు టు టౌన్ సిఐగా పనిచేసిన లక్ష్మణరావు సహా 120 మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అయ్యప్పనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన అందజేశారు. స్పందన లేకపోవడంతో 'జగనన్నకు చెబుదాం' పేరిట కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు 9 సార్లు అందజేశారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ముమ్మారు నేరుగా వినతులు స్వీకరించి, వెంటనే ప్లాంట్ సీజ్‌చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ రెండు సార్లు, ఆర్‌డిఒకు రెండు సార్లు అర్జీలిచ్చారు. మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లకు కాలనీవాసులు తొమ్మిదిసార్లు సార్లు, జలవనరుల శాఖ అధికారులకు రెండు పర్యాయాలు వినతులు అందజేశారు. మేయర్ అందరూ పరిష్కరిస్తామని చెప్పడమే తప్ప అమలుకు ప్రయత్నం చేయలేదు. చివరకు జిల్లా కలెక్టర్ కూడా ఆదేశాలు తప్ప అమలు గురించి పట్టించుకోవడం లేదు. దీంతో అధికారులు ఓ ప్రతిజాప్రతినిధి ఒత్తిడికి తలొగ్గారని, చివరకు జిల్లా కలెక్టర్ కూడా మీనమేషాలు లెక్కిస్తే ప్రజలకు దిక్కెవరని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఒకానొక సందర్భంలో పోలీసుల సమక్షంలో మున్సిపల్ అధికారులు ప్లాంట్‌ను సీజ్‌చేసినప్పటికీ, గంట వ్యవధిలోనే తెరిచి యథేచ్ఛగా నిర్వహించుకుంటున్నా జిల్లా అధికారులు అచేతనంగా ఉండిపోవడం గమనార్హం.



మేయర్ విజయలక్ష్మికి వినతి అందిస్తున్న పిపిఎస్‌ఎస్, అయ్యప్పనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

ఆగని పోరాటం

అయ్యప్పనగర్‌లో అక్రమ వాటర్ ప్లాంట్ నిర్మాణంపై పోరాటం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే కాలనీలోను, కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కాలనీవాసులు పలుమార్లు ధర్నాలు నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుటా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు, రాజకీయ నాయకుల్లో స్పందన లేదు. నగరంలోని పలు సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీలు వారికి మద్దతు, సంఘీభావం తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఇంకా అవసరమైతే దీక్షలకు సిద్ధపడతామని కాలనీవాసులు చెబుతున్నారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకుంటే ప్రభుత్వానికే నష్టం



స్థానిక నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకుంటే ప్రభుత్వానికే నష్టం. అధికారులు ప్రజాస్వామ్య విలువలను పక్కనబెట్టి నాయకుల కనుసన్నల్లో నడుచుకోవడం సిగ్గుచేటు. మా సమస్యలు మాకు ఎలాగూ ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో కాలనీవాసులే కాదు, అయ్యప్పనగర్ వాసుల సమస్యను గమనిస్తున్న వారంతా పాలకులకు బుద్ధిచెప్తారు. స్పందన పేరును జగనన్నకు చెబుదాం అని మార్పుచేస్తే సరిపోదు. చెప్పిన సమస్యలు పరిష్కరిస్తేనే ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకం పెరుగుతాయి. చివరికి కలెక్టర్ కూడా ఇలా అచేతనంగా ఉండిపోతారని మేము అనుకోలేదు. అధికారులు న్యాయం చేయపోతే వారిపై న్యాయస్థానానికి వెళ్లేందుకు కూడా వెనుకాడేది లేదు.

- యుఎస్ రవికుమార్, అయ్యప్పనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ పోరాట కమిటీ కన్వీనర్



రాస్తారోకోలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

నిరుద్యోగులను మోసగించిన మోడీ

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మోడీ ఆ తర్వాత వారిని మోసగించి రోడ్డున పడేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిరుద్యోగులతో నిర్వహించిన సదస్సులో తమ్మినేని సూర్య నారాయణ ప్రసంగించారు. అనంతరం పట్టణం లోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న విశాఖ -అరకు రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలోనూ, ధరలను అదుపు చేయడంలోనూ ఘోరంగా విఫలమైందన్నారు. గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతుందన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయకపోతే అప్పుకి అనుమతి ఇచ్చేది లేదని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం బెదిరిస్తుందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ ఆ విధానాలనే అత్యుత్సాహంగా అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. ప్రభుత్వ రంగాల్లో ఖాళీ ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలు అదుపు చేయాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, ఎరువులు ధరలు తగ్గించాలని, కౌలు రైతులకు రుణాలు, గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలని, కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా విభజన చట్టంలో హామీలు అమలు చేయాలని, పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు ట్రాన్స్ పోర్ట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. వీటికి వ్యతిరేకంగా నేడు మండల కేంద్రాల వద్ద ధర్నాలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబు, రాము, సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, సిపిఎం నాయకుడు ముత్యాలు, అశోక, రమేష్, సవరాల అనీలు, భారతి, సంఘవి ఆమని తదితరులు పాల్గొన్నారు.



జెవివి జిల్లా నూతన కార్యవర్గం

జెవివి జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జన విజ్ఞాన వేదిక జిల్లా 12వ మహాసభ స్థానిక జిల్లా పరిషత్తు కాంపౌండ్‌లోని మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగింది. మహాసభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'కృత్రిమ మేధస్సు' అనే అంశంపై 'ఫ్రీ సాఫ్ట్‌వేర్ మూవ్మెంట్ ఆఫ్ ఇండియా' సంస్థ నుంచి శ్రీపతి రాయ్, 'చంద్రయాన్-3, ఆదిత్యా ఎల్ -1, ఇతర రోదసి యాత్రల'పై రమణ ప్రభాత్, 'స్వావలంబన -సైన్స్' అనే అంశంపై ఎం.వి.ఎన్. వెంకటరావు ప్రసంగించారు. ప్రజారోగ్యం ప్రజల ప్రాథమిక హక్కుగా ఉండాలని, గ్రంథాలయాల నిర్వహణ బాధ్యత రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని మహాసభ తీర్మానించింది. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్ సమన్వయంతో జరిగిన ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ జె.చంద్రశేఖర్, జి.నీలయ్య, సింహాద్రి నాయుడు, అధ్యక్షులుగా డాక్టర్ ఎం.వి.ఎన్. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా పి.రమణ ప్రభాత్, సహాధ్యక్షులుగా కె.మురళీబాబు, ఉపాధ్యక్షులుగా పి.వేణుగోపాల్, పి.సత్యం నాయుడు, వి. రాజగోపాల్, జి.నిర్మల, వి.సుశీల, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శులుగా ఎస్.సత్యనారాయణ, డాక్టర్ చిన్నారి, చంద్రశేఖర్, సత్యశ్రీనివాస్, పి.లక్ష్మ నాయుడు, సతీష్, వి.మోహనరావు, కోశాధికారిగా సిహెచ్. సింహాచలం ఎన్నికయ్యారు.

మోడీది మొసలి కన్నీరు

విజయనగరంకోట : మోడీ మొసలి కన్నీళ్లను ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగ యువతను ప్రధాని మోడీ మోసం చేశారని విమర్శించారు. స్విస్ బ్యాంకులో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి భారతీయుడి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తారని చెప్పిన మాట నిలబెట్టుకోలేదన్నారు. పెద్దనోట్ల రద్దుతో దేశంలో అనేకమంది రోడ్డు మీదకు వచ్చి బ్యాంకు దగ్గర బారులుతీరి వారి ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. కరోనా సమయంలో ప్రధాని మోడీ ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అనేకమంది వలస కూలీలు కాలినడకన వచ్చి ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా కనీసం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ విదేశీ యాత్రలతో కాలయాపన తప్ప దేశంలో ప్రజా సంక్షేమం పట్టదని దుయ్యబట్టారు. మోడీ దృష్టిలో అభివృద్ధి అంటే ఆదాని, అంబానీలు, కార్పొరేట్ రంగ సంస్థల తప్ప ప్రజలు కాదన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితంగా గ్యాస్ మీద రూ.200 తగ్గించి మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు తప్ప మరేమీ కాదన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే గ్యాస్‌పై రూ.300 నుంచి రూ.500 వరకు పెంచే అవకాశం ఉందన్నారు.

కౌలురైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో కౌలురైతులకు రైతు భరోసా ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో లక్షకుపైగా కౌలు రైతులు ఉన్నారని ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిషన్ చెప్పిందని, కౌలురీత్యా వీరిలో కనీసం 60 వేల మంది భూమిలేని కౌలుదార్లు ఉంటారని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు పెట్టి కేవలం 2,603మంది కౌలురైతులకు మాత్రమే రైతు భరోసా జమ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం 99 శాతం వాగ్దానాలను అమలు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటోందని చెప్పారు. కౌలురైతుల విషయంలో కనీసం 10 శాతం కూడా హామీలను అమలు చేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. భూ యజమాని ఆమోదం ఉంటేనే కౌలుదారుగా గుర్తిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం గ్రామసభలు పెట్టి కౌలురైతులను గుర్తించి, సుమారు 24 వేల మందికి గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పథకాలు వర్తించేవని వెల్లడించారు. వైసిపి ప్రభుత్వం వచ్చేక గత ప్రభుత్వంలో 10 శాతం కూడా ఇవ్వకుండా, కౌలురైతులను ఆదుకుంటున్నట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎకరంలోపు కౌలుచేస్తూ సొంత భూమిలేని కౌలు రైతులకు రైతు భరోసా వర్తించదని తెలిపారు. ఒక రైతు వద్ద ఒకరికి మించి నలుగురు, ఐదుగురు కౌలుచేస్తుంటే వారిలో ఒకరికి మాత్రమే రైతుభరోసా ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. భూమి ఉన్న ఒసి రైతులకు రైతుభరోసా వర్తిస్తున్నా, భూమిలేని ఒసి కౌలురైతులకు ఆ పథకం వర్తింప చేయకపోవడం అన్యాయమని చెప్పారు. అవసరమైన సవరణలు చేసి నిబంధనలు మార్చి కౌలుచేస్తున్న భూమిలేని ప్రతి కౌలురైతుకూ రైతు భరోసా వర్తింప జేయాలని డిమాండ్‌చేశారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఉద్ఘాటించారు. ఆదివారం ఒకటో డివిజన్ పూల్‌బాగ్ ప్రాంతంలోని హనుమాన్ నగర్, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంతాలలో వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. 57 లక్షల రూపాయలతో నిర్మించిన రహదారులు, కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జులు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులను పూర్తిచేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, మాజీ కౌన్సిలర్ గదుల సత్యలత, దాసు, సీతాలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

విజయనగరం మండలంలోని నారాయణపురానికి చెందిన 90 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. వారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. వైసిపి మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జొన్నవలస పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లా త్రినాథ్, యువజన విభాగం మండల నాయకులు సువ్వాడ శ్రీను పాల్గొన్నారు.

9,10న రంగం రాష్ట్ర మహాసభలు

విజయనగరం కోట : ఈ నెల 9, 10వ తేదీల్లో కర్నూలులో రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నారని జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరావు, గోకా రమేష్‌బాబు, దప్పు శ్రీను తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఏర్పడి ఐదేళ్లయిందని చెప్పారు. ఈ కాలంలో అనేక కార్యక్రమాలను నిర్వహించిందన్నారు.

నగర ప్రజలకు మెరుగైన సేవలు

విజయనగరం నగరంలో ప్రజల ఆరోగ్యాలను కాపాడే విధంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. మెరుగైన సేవలకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవల గురించి వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

- దోమల నివారణకు 40 స్ప్రే మిషన్లు
- ఆధార్ కార్డు ఆధారంగా ట్రేడ్ లైసెన్స్
- 'ప్రజాశక్తి'తో నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి ముఖాముఖి



? పెరుగుతున్న నగర విస్తీర్ణం రీత్యా ఎంతమంది కార్మికులు అవసరం, ఉన్న వారి సంఖ్య ఎంత?.

ప్రస్తుతం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పర్మినెంట్ కార్మికులు195 మంది, అవుట్ సోర్సింగ్ కార్మికులు 456 మంది ఉన్నారు. వాస్తవానికి 700 ఇళ్లకు ఐదుగురు కార్మికులు ఉండాలి. దీని ప్రకారం మరో 147 మంది అవసరం. పాలకవర్గం అనుమతితో అదనంగా 70 మందిని తీసుకున్నాం. ఉన్న కార్మికులను పని విభజన చేసి, సచివాలయానికి 10 మంది కార్మికులతో పనులు చేయిస్తున్నాం. అదనంగా తీసుకున్న 70 మంది కార్మికుల్లో 30 మంది ప్రత్యేకంగా రాత్రివేళ ప్రధాన రహదారుల్లో పారిశుధ్య పనులు చేస్తున్నారు.

? నగరంలో చెత్త సేకరణ ఎలా సాగుతోంది?.

నగరంలో 53 క్లాప్ వాహనాలు, నగర పాలక సంస్థ దగ్గర ఉన్న 41 వాహనాలతో చెత్త తరలిస్తున్నాం. రోజుకు 120 టన్నుల చెత్త సేకరిస్తున్నాం. ఇందులో 100 టన్నుల వరకు చెత్తను విశాఖలో ఉన్న జిందాల్ పరిశ్రమ వారు ప్రతిరోజూ తీసుకెళ్తున్నారు. మిగతా 20 టన్నుల వరకు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

? యూజర్ ఛార్జీల వసూలు ఎలా ఉంది?.


చెత్తను తరలించేందుకు స్వచంద్ర కార్పొరేషన్ ద్వారా నగరంలో ఉన్న 53 వాహనాలకు అయ్యే ఖర్చును యూజర్ ఛార్జీల పేరుతో వసూలు చేస్తున్నారు. వాస్తవానికి వాహనాలకు ప్రతి నెలా 40 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది. కానీ యూజర్ ఛార్జీలు రూ.20 లక్షల నుంచి 25 లక్షల వరకు మాత్రమే వసూలు అవుతున్నాయి. మిగిలిన మొత్తాన్ని కార్పొరేషన్ నుంచి చెల్లిస్తున్నాం. నగర ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలి.

? దోమల నివారణకు తీసుకున్న చర్యలేమిటి?.

వర్షాకాలం కావడంతో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే రెండు ఫాగింగ్ మిషన్లు, 40 చేతి స్ప్రే మిషన్లు ద్వారా స్ప్రే చేయిస్తున్నాం. 600 లీటర్ల వరకు లిక్విడ్ అందుబాటులో ఉంది. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో, చెరువుల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. ప్రతి సచివాలయ పరిధిలో 5 స్ప్రే మిషన్లు ద్వారా స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. నగర ప్రజలు కాలువల్లో చెత్త వేయకుండా, మురుగునీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

? ట్రేడ్ లైసెన్స్ ద్వారా కార్పొరేషన్‌కు వస్తున్న ఆదాయం ఎంత? దీన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

నగరంలో ట్రేడ్ లైసెన్స్ ఉన్న షాపులు 1800 వరకు నమోదయ్యాయి. వీటిలో డబుల్ ఎంట్రీ కలిగిన షాపులు ఉన్నాయి. వాటిని తీసేస్తే 1200 షాపుల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు ఏటా రూ.26 లక్షల వరకు వసూలవుతోంది. ఆదాయం పెంచేందుకు నగరంలో ఉన్న అన్ని షాపులను సర్వే చేసి, ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి తీసుకొస్తాం. కేవలం ఆధార్ కార్డు ఉంటే ట్రేడ్ లైసెన్స్ ఇవ్వనున్నారు.



? ప్లాస్టిక్ నియంత్రణ అమలుకు చేపట్టిన చర్యలేమిటి?.

ప్లాస్టిక్ నియంత్రణకు నగర ప్రజలు, వ్యాపారులు సహకరించాలి. ఇప్పటికే అనేక షాపుల్లో తనిఖీలు చేశాం. కొన్ని షాపులకు అపరాధ రుసుం కూడా విధించాం. దీనికోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో 6 బృందాలు పర్యవేక్షణ చేస్తున్నాయి. ప్లాస్టిక్ నియంత్రణను పాటించి పర్యావరణాన్ని కాపాడటంతోపాటు ప్లాస్టిక్ రహిత నగరంగా విజయనగరం నిలిచేలా సహకరించాలి.

? మెరుగైన పారిశుధ్యం అమలు కోసం ప్రజలకిచ్చే సందేశం ఏమిటి?.

వర్షాకాలం కావడంతో కాలువల్లో చెత్త వేయకుండా, నగర పాలక సంస్థ వాహనాలకు అందించాలి. ప్రతి ఇంటి ముందుకు కార్మికులు, వాహనాలు వస్తున్నందున బయట చెత్త వేయకుండా కార్మికులకు అందివ్వాలి. కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలి. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి. నగరంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పారిశుధ్య నిర్వహణలో కార్మికులకు సహకరించాలి.

షేక్‌పాడుకు రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

షేక్‌పాడు గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షేక్‌పాడు గిరిజన గ్రామంలో సుమారు 40 కుటుంబాలు జీవిస్తున్నారని, ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేక చిన్నగొడ్డి ద్వారా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. గుమ్మిడి గూడ ప్రధాన రహదారి నుంచి షేక్‌పాడు గిరిజన గ్రామానికి సుమారు కిలోమీటర్ మేరకు రహదారి నిర్మిస్తే గిరిజన ప్రజలు రవాణా సౌకర్యం కల్పించినట్లు అవుతుందని తెలిపారు. అత్యవసర సమయంలో వైద్య పరంగా కనీసం 108 వాహనం కూడా వెళ్లే అవకాశం లేదన్నారు. కిలోమీటర్ మేరకు ప్రధాన రహదారి వద్దకు మోసుకొని వచ్చి 108 వాహనం కానీ ఆటో కానీ ఎక్కించాలని తీసుకెళ్లే పరిస్థితులు ఉన్నాయన్నారు. కావునా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

పెద్దబుడ్డిడిలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడిలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో ప్రజలకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా ప్రభుత్వ వైద్య సేవలు కరువయ్యాయని, దీంతో వైద్యం కోసం పార్వతీపురం, పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో గత్యంతరం లేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో పిహెచ్‌సి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీరామ్మూర్తికి జగదీశ్వరి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

శనివారం రాత్రి పాము కాటు గురై పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు గురాన శ్రీరామ్మూర్తి నాయుడిని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ టి.జగదీశ్వరి ఆదివారం ఆస్పత్రి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గుర్చి తెలుసుకొని అనంతరం వైద్య సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆరోగ్యం వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలిపారని ధైర్యంగా ఉండమని ఆయనకు ధైర్యాన్ని ఇచ్చారు.

ఉత్తమ ఉపాధ్యాయులు కృష్ణకు సత్కారం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని భామినికి చెందిన లోపింటి కృష్ణ ఆదిత్య డిగ్రీ కాలేజీలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. శ్రీశ్రీ ఫౌండేషన్ వారు ఆదివారం శ్రీకాకుళంలో లోపింటి కృష్ణకు శాలువాతో సత్కరించి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. ఇటువంటి అవార్డులు పొందిన వ్యక్తి మక్కువ, గౌరవం, బాధ్యతను పెంచుతాయని కృష్ణ తెలిపారు. కృష్ణకు భామిని గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథలు చదివించడం, ఆటలు ఆడించడం జరిగింది. గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన్ రావు మాట్లాడుతూ చదువు ఒక్కటే సమాజ అభివృద్ధికి మూలమని, పిల్లలు చదువులో చురుకుదనం చూపించాలని అన్నారు. అలాగే మానసిక ఉల్లాసం కోసం ఆటలు ఆడాలన్నారు. కార్యక్రమంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో గిరిజనులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో ఉన్న బుడగ జంగం, వాల్మీకి, బెంతు ఒరియా, ఏనేటి కొందు సామాజిక వర్గాలకు వైఎస్ఆర్ చేయూత పథకానికి కుల ధ్రువీకరణ పత్రం లేకపోయినా సెల్ఫ్ డిక్లరేషన్‌తో పెట్టుకోమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విచారకరమని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు అన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్‌తో నిజమైన లబ్ధిదారులు నష్టపోవడంతో పాటు నకిలీలు ఎక్కువమంది ప్రవేశించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని నిజమైన అర్హులకు వర్తింపచేయాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆదివాసీ తెగలో నకిలీలు చేరి నిజమైన ఆదివాసీలకు పథకాలు అందకుండా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఒక్క పథకానికే పరిమితం కాకుండా అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో నకిలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, దీంతో నిజమైన ఆదివాసీలు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.

వాహనాలకు రక్షణేది..?

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అత్యవసర సేవలు నిమిత్తం ప్రభుత్వం 108, 104 వాహనాలను మంజూరు చేసింది. అయితే ఈ వాహనాలకు కనీసం రక్షణ సౌకర్యం కల్పించకపోవడంతో ఎండకు ఎండి, వర్షానికి తడిచి వాహనాలు పాడైపోతున్నాయి. వాహనం పెట్టేందుకు షెడ్ లేకపోవడం వల్ల ముళ్ల పొదల మధ్యలో పెడుతున్నారు. దీంతో విష సర్పాలు వాహనాల్లోకి చొరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ప్రజలకు సేవలు అందించే వాహనాలకు రక్షణ నిమిత్తం షెడ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


ముళ్ల పొదల మధ్య ఉన్న 108 వాహనం

చెరువు కాదు..రోడ్డే

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డు చెరువును తలపిస్తుంది. పూల్ బాగ్ రోడ్డులో పెద్దపెద్ద గోతులు ఉండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు చేరింది. దీంతో గోతులు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు బాగు చేసేందుకు మున్సిపల్ సాధారణ నిధులు నుంచి రూ.40లక్షలు కేటాయించి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికి పూర్తి చేయలేదు. దీంతో రోడ్డుపై గోతులు భయంకరంగా తయారయ్యాయి. రోడ్డు గోతులలో వరదనీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


చెరువును తలపిస్తున్న పూల్‌బాగ్ రోడ్డు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బలిజిపేట

వంగర మండలం కొండచాకరాపల్లికి చెందిన యాలకుల పాపినాయుడు (45) పురుగుమందు తాగి మృతి చెందినట్లు బలిజిపేట ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పాపినాయుడు గత కొన్నేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడని, తరచూ ఈ వస్తుందని మనస్థాపన చెంది తండ్రికి నారాయణపురం వెళ్లి మూర్ఛ నివారణకు మందులు కొనుక్కుంటానని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే మార్గంలో సువర్ణముఖి నది వద్ద గడ్డి మందు తాగి మరణిస్తున్నట్లు తన తమ్ముడికి తెలిపాడు. వెంటనే విషయం తెలుసుకున్న అతని తమ్ముడు, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని రాజాం హాస్పిటల్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ?

మోడీకి సిపిఎం సూటి ప్రశ్న

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిజెపి అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ... తొమ్మిదేళ్లలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు ప్రశ్నించారు. సిపిఎం సమరభేరిలో భాగంగా స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్‌రావు అధ్యక్షతన ఆదివారం నిరుద్యోగ సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో శంకరరావు మాట్లాడుతూ రైల్వేలో ఖాళీలు భర్తీ చేయకపోవడంతో వరుస ప్రమాదాలతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే.. మోడీ మౌనం వహించి, ప్రమాదాలకు మతం రంగు పులిమే దుర్మార్గపు ఆలోచన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రక్షణ రంగమైన ఆర్మీలో కూడా తాత్కాలిక ప్రాతిపదికన నియమించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూనే కేంద్రంలో బిజెపిని బలపరుస్తున్నాయని, ఈ అవకాశవాద రాజకీయాలను యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వేజోన్, ఉన్నత విద్యాసంస్థలు సాధన, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఈ మూడు పార్టీల విధానాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.


సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకరరావు


బొబ్బిలి: మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్

గతంలో టిడిపి, ప్రస్తుత వైసిపి అనుసరిస్తున్న విధానాల వల్లే రాష్ట్రంలో నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్తు ఛార్జీలు, కరెంటు కోతలకు కారణమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్మోహనరావు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు వెంకటేష్, రుద్ర ప్రసాద్ మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. మెగా డిఎస్‌సిని ప్రకటించాలని, ఉద్యోగుల వయోపరిమితి 62 సంవత్సరాల నుంచి కుదించాలని, పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో ప్రజలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు సతీష్, సౌమ్య, జగదీష్, రామకృష్ణ, సోమేశు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని పెంచుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. స్థానిక ఫ్లైఓవర్ వంతెన కింద ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ జనాభాలో 35 సంవత్సరాలు వయసులోపు యువత 65శాతం ఉన్నారనీ ఈ యువతకు ఉద్యోగం ఉపాధి కరువై రోడ్లమీద నిరుద్యోగులుగా తిరుగుతున్నారని గుర్తు చేశారు. సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని మోడీ, స్థానికులకు 75శాతం కంపెనీలో ఉపాధి కల్పిస్తామని జగన్ చెప్పి ఇప్పుడు మాటతప్పారన్నారు. నిరుద్యోగాన్ని పెంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 4 మధ్యాహ్నం రెండు గంటలకు ఎమ్మార్వో ఆఫీస్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సదుస్సులో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, శివ, డేవిడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై రామారావు కార్మికులనుద్దేసించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని దుయ్య బట్టారు. ముఖ్యంగా మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేయడం వల్ల కార్మిక, వ్యవసాయ, విద్యుత్ రంగాలు దెబ్బతిని ఉపాధి కోల్పోయారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు విరమించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


నెల్లిమర్ల: కార్మికులతో మాట్లాడుతున్న రామారావు

చంద్రబాబుతోనే ఆంధ్రాకు భవిష్యత్తు

ప్రజాశక్తి - వేపాడ

చంద్రబాబు సిఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని అరిగిపాలెంలో ఆదివారం రాత్రి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు, అనుభవజ్ఞుడు, పాలనాదక్షత కలిగిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వస్తే తప్ప మన రాష్ట్రం బాగుపడదన్నారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ' మేనిఫెస్టోలోగల అంశాలన్నీ గ్రామంలో ప్రజలకు వివరించారు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల్లో కూరికిపోయిందని, జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు ఒక్క ఫ్యాక్టరీ కూడా వచ్చిన దాఖలాలు లేవని, మద్యం బాండ్లను తాకట్టు పెట్టి ఎంతో నమ్మకంతో ఎన్నుకున్న ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చారని ఆరోపించారు. బటన్ నొక్కడం తప్ప ఏ పథకమైనా సకాలంలో లబ్ధిదారులకు పూర్తిగా అందేలా కృషి చేశారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను, భవనాలను తాకట్టు పెట్టి అప్పులు చేయడమే ఈ ప్రభుత్వ విధానమని ఎద్దేవా చేశారు. నిరుపేదలకు సెంటున్నర భూమిచ్చి జగన్‌రెడ్డి మాత్రం విశాలమైన కొండలపై భవనాలు నిర్మించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళితులను అన్నదమ్ములు, మేనకోడళ్ళు అని చెప్పి తానే మేనమామను అంటూ ముద్దులు పెట్టి ఇప్పుడు దళితులు పైన తప్పుడు కేసులు పెట్టి మానసికంగా హింసించడం చూస్తుంటే జగన్మోహన్ రెడ్డికి దళితులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రత్యేక హోదా లేదు, నిరుద్యోగులకు ఉపాధి లేదు, భూకబ్జాలు, ఇసుక మాఫీయాలో మాత్రం ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఐటిడిపి మండల అధ్యక్ష


మాట్లాడుతున్న గొంప కృష్ణ, వెంకటరావు

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తవలస

వికలాంగుల సంక్షేమం కోసం గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్ బాబు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ పూర్వపు అధికారి (ఐఆర్ఎస్) కెవి చౌదరి అన్నారు. ఆదివారం ట్రస్ట్ ఆవరణలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ సహకారంతో రూ.25 లక్షల నిధులతో 40 మంది లబ్ధిదారులకు జీవనోపాధి కల్పించడానికి, శ్రీగురుదేవ్ చాటిబుల్ ట్రస్ట్ ద్వారా 40 కిరాణా షాప్ బడ్డీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క సంస్థ కూడా ఇటువంటి సేవా కార్యక్ర మాలు చేయలేదని ఆయన అన్నారు. గురుదేవా ట్రస్టు ద్వారా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడం, కనీస వైద్య సదుపాయం అందించాలన్న తపనతో ఆస్పత్రిని కూడా నిర్మించిన ఘనత జగదీష్‌బాబుకే దక్కుతుందన్నారు. కిరణా షాపుల ద్వారా లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. సిడ్బీ (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ అఫ్ ఇండియా) స్వావాలంబన్ అండర్ సిఎస్ఆర్ ఇన్నోవేటివ్ నిర్వహించిన 30 మంది వికలాం గులకు సరుకులతో పాటు ఉచిత పాన్ షాప్‌లు, 50 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్ళు, చేతులు, ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, చెవిటి మెషిన్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో సిడ్బీ డిజిఎం సౌరబ్ భాజపై, అసోసియేట్ మేనేజర్ శ్రీష్టి ఠాకూర్, హెవీ వాటర్ బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్. సత్యకుమార్, సురేష్, శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.జగదీశ్ కుమార్, ఆస్పత్రి సిఇఒ డాక్టర్ అచ్చుత రామయ్య, బి. న్. రావు, ట్రస్ట్ స్టాఫ్, హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.


వికలాంగులకు పరికరాలు అందిస్తున్న ప్రతినిధులు

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమికాపల్లి గ్రామంలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ్ హరికుమార్ ఆధ్వర్యంలో 39 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక డిప్యూటీ తహశీల్దార్ రమేష్, తుమ్మికపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు హాజరై పంపిణీ చేశారు. డిటి రమేష్ మాట్లాడుతూ హరి చేస్తున్న సేవ కార్యక్రమాలు ఎప్పటినుంచో చూస్తున్నానని చిన్న వయసులో ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. డిసెంబర్ నెలలో తన కొడుకు పుట్టినరోజు సందర్భంగా 40 మంది వృద్ధులకి కూడా నిత్యావసర సరుకులు అందిస్తానని అన్నారు. సర్పంచ్ విరోతి కొండలరావు మాట్లాడుతూ హరి చేస్తున్న సేవలు మరువలేనవని అన్నారు. వృద్ధులైన సొంత తల్లిదండ్రులనే చూడని ఈ రోజుల్లో, అనాధ వృద్ధులకు దహన సంస్కారాలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ సభ్యులు విశ్వనాథ అనురాధ పుట్టినరోజు సందర్భంగా 20 మంది ఒంటరి వృద్ధులకు సహాయం అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, సభ్యులు ధర్మ, గణేష్, బుజ్జి, నగేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలికి నిత్యావసరాలిస్తున్న డిటీ

వాలంటీర్ సేవా దృక్పథం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామానికి చెందిన గోకాడ అప్పల నరసమ్మ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న వాలంటీర్ జలగడుగుల పుష్ప సొంత ఖర్చులు పెట్టుకుని ఆదివారం విశాఖపట్నం వెళ్లి పింఛను సొమ్మును అప్పలనర్సమ్మకు అందించింది. దీంతో గ్రామస్తులు వాలంటీర్ సేవా దృక్పదాన్ని కొనియాడుతున్నారు.


నగదు అందిస్తున్న వాలంటీర్

మట్టి వినాయక విగ్రహాలు సిద్ధం

ప్రజాశక్తి- బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసేందుకు వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు సిద్ధం చేశారు. జల కాలుష్యాన్ని నివారించేందుకు మట్టి వినాయక విగ్రహాలకు పూజలు చేయాలని కృష్ణదాసు కోరారు. వినాయక చవితి సంధర్భంగా భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు మట్టి విగ్రహాలకు పూజలు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి- బాడంగి

మందు తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్ఐ ఆర్ జయంతి అన్నారు. ఆదివారం సాయంత్రం రామభద్రపురం, రాజాం రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపినా, లైసెన్స్ లేకపోయినా, సరైన వాహన పత్రాలు చూపించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వేగంగా వాహనాలు నడుప రాదని అన్నారు. ప్రతి మహిళ దగ్గర దిశా యాప్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సన్యాసిరావు పాల్గొన్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ జయంతి

మన్యం రాజకీయాలపై బొత్స గురి

కోటరీ పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి • ఎన్నికలు సమీపిస్తున్న వేళ వరుస టూర్లు

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నంలో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. గడచిన నాలుగేళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించిన బొత్స ఇప్పుడు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తన కోటరీ చెక్కుచెదరలేదని నిరూపించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనిలో భాగంగా గత కొద్ది నెలలుగా బొత్స మన్యం జిల్లాపై దృష్టి సారించడం చర్చనీయాంశమైంది. ఇటీవల కాలంలో జిల్లాలో జరిగిన అధికారిక, అనధికార పార్టీ సమావేశాల్లో బొత్స పాల్గొని తన అనుచరులను కార్యోన్ముఖులను చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అటు విజయనగరం, ఇటు మన్యం జిల్లా లో ఇంతవరకు తన తరపున రాజకీయాలు నడిపిన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావుతో పొసగని నేపథ్యంలో సొంత కోటరీ పునర్నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇంతవరకు అధికారపార్టీలో నడిచిన 'వన్ మాన్ షో' రాజకీయాలకు చెక్ పెట్టాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని కోసం మన్యం జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలకు హాజరవుతూ అనుచరులకు గీతోపదేశం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కొద్దినెలల క్రితం సాలూరు మండలం మామిడిపల్లిలో వైసిపి సీనియర్ నాయకులు సువ్వాడ తవుడు విగ్రహావిష్కరణకు ఆయన హాజరయ్యారు. ఆ కార్యక్రమం అనంతరం అదే గ్రామానికి చెందిన వైసిపి మండల సీనియర్ నాయకులు సువ్వాడ రమణ మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను ఇంటికెళ్లి పరామర్శించారు. తర్వాత వృద్ధాప్యం రీత్యా అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి తిరుపతినాయుడును బాగువలస వెళ్లి పరామర్శించారు. ఇలా బొత్స ఎక్కడకు వెళ్లినా గతంలో తన అనుచరులుగా ఉన్న వారిని కలుస్తున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని పరామర్శించి ధైర్యం కల్పించడం, మరణించిన నాయకుల కుటుంబ సభ్యులను ఓదార్చడం చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంత్రి బొత్స సత్యనారాయణ తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. మన్యం జిల్లా మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇప్పటికే ఉన్న గ్రూపు రాజకీయాలు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో బలమైన గ్రూపు నాయకులతో మంతనాలు జరుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ మార్పు అంశం తెరపైకి వస్తోంది. గతంలో చైర్‌పర్సన్ ఎన్నిక ముందు పట్టణానికి చెందిన వైసిపి గ్రూపులు పదవి కోసం పోటీ పడ్డాయి. అప్పుడు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం రాజన్నదొర సమక్షంలో కుదిరిన ఒప్పందం గడువు సమీపిస్తోంది. రెండున్నర ఏళ్ల తర్వాత చైర్‌పర్సన్‌ను మార్చి ఇంకో వర్గానికి చెందిన మహిళా కౌన్సిలర్‌ను ఆ పదవిలో కూర్చోబెడతామని అగ్రనేతలు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఒప్పందం అమలు చేయాలని పట్టణ వైసిపిలో మరో గ్రూపు నాయకులు పట్టు పడుతున్నారు. దీని కోసం వారు జెడ్పీ చైర్మన్, డిప్యూటీ సిఎంలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న వైసిపి గ్రూపు నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణ ఆశీస్సులు కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒప్పందం అమలు కోసం బొత్స వారికి భరోసా ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. రెండు రోజుల క్రితం పార్వతీపురం నియోజకవర్గంలో గడపగడపకూ ప్రభుత్వం ముగింపు కార్యక్రమానికి బొత్స సత్యనారాయణ హాజరయ్యారు. తన అనుచరుడు, ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బొత్స పార్టీ నాయకులు, కార్యకర్తలను చైతన్యపర్చారు. మన్యం జిల్లా రాజకీయాల్లో తన ముద్ర చెరిగిపోకుండా పూర్వవైభవం సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఏమైనా మన్యం జిల్లా రాజకీయాల్లో రానున్న ఎన్నికల ముందు ఆసక్తి కరమైన పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.


అభినందన సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ (ఫైల్)

గణపతికి సన్మానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలికి చెందిన రంగుముద్రి గణపతి వైసిపి ఇజిల్లా కార్యదర్శిగా నిమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి ఆదివారం ఘనంగా నిమించారు. పార్టీ అభివృద్ధికి చేసే కార్యక్రమాల్లో సహకరిస్తామని తెలిపారు. అనంతరం గణపతి మాట్లాడుతూ తనకు ఈ పదవిలో నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ రంగుముద్రి రమాదేవి, పెదబోగిలి వైస్ సర్పంచ్ అరవింద్‌కుమార్, మాజీ ఎంపిటిసి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.